ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
మంగళవారం 22 అక్టోబరు 2024



ఏపీఎంఐపీ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరెడ్డి

కడప రూరల్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డిని వైఎస్సార్ కడప జిల్లా ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీఎంఐపీ) డైరెక్టర్‌గా ఏడాది కాలానికి డిప్యుటేషన్‌పై నియమించారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన నేడోరేపో బాధ్యతలు చేపట్టనున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే

కఠిన చర్యలు

- రౌడీషీటర్లకు కౌన్సెలింగ్
- డీఎస్పీ వెంకటేశ్వర్లు



ఫేస్‌టుఫేస్

(కడప-ఆంధ్రజ్యోతి): కడప సబ్ డివిజనులో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని, కఠిన చర్యలు తీసుకుంటామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పీస్‌ఫుల్ కడపగా ఉంచాలన్నదే తమ లక్ష్యమని అందుకు తగ్గట్లు చర్యలు చేపడుతున్నామన అన్నారు. ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: రౌడీషీటర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు
జవాబు: రౌడీలు, గూండాల ఆటలు సాగనివ్వం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడేదే లేదు. ఎస్పీ సూచనల మేరకు రౌడీలు, గుండాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. నేరప్రవర్తన ఉన్నవారిపై ప్రత్యేక నిఘా పెట్టాం. వారి కదలికలను అంచనా వేస్తున్నాం.

ప్రశ్న: ఎంత మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు
జవాబు: వారం రోజుల వ్యవధిలో 270 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చాం. నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చాం. వారిపై బైండోవర్ నమోదు చేశాం. 751 మంది అనుమానితులను గుర్తించాం. వారికీ వార్నింగ్ ఇచ్చాం. సబ్ డివిజను పరిధిలో 823 మంది వివిధనేరాల్లో శిక్షలు పొంది బయటికి వచ్చారు. వారిపై కూడా నిఘా ఉంచాం.

ప్రశ్న: కడపలో రౌడీగ్యాంగ్‌లు ఉన్నాయి. వీరికి రాజకీయ పంచన చేరారు?
జవాబు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే పీచమణచాలని ఎస్పీ ఆదేశించారు. గ్యాంగ్‌లు తోక జాడిస్తే కట్ చేస్తాం. ఇప్పటికే అందరిపై నిఘా పెట్టాం. గ్యాంగ్‌లని చెప్పుకుని ఎవరైనా బెదిరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు తీసుకోకపోతే నా వద్దకు వస్తే గ్యాంగ్‌ల పీచమణచివేస్తాం.

ప్రశ్న: ఇసుక గ్రావెల్ మట్టి దందాపై..
జవాబు: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే పలు కేసులు పెట్టాం. ప్రభుత్వ నిబంధనల మేరకు రవాణా చేసుకోవాలి.

ప్రశ్న: ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలపై?
జవాబు: ప్రభుత్వ నిబంధనల మేరకే బార్లు, మద్యంషాపులు తెరచుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. ఆరుబయట మద్యంసేవిస్తున్న వారిపై ఇప్పటికే 60 కేసులు నమోదు చేశాం. మద్యంతాగి వాహనాలు నడిపేవారిపై 20 కేసులు పెట్టాం. ఒంటిమిట్టలో బెల్టుషాపులపై కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: టీడీపీ నగర అధ్యక్షుడిపై దాడి చేసినవారిని ఎప్పుడు పట్టుకుంటారు
జవాబు: టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేసిన వారిని త్వరలోనే పట్టుకుంటాం. ఇప్పటికే రెండు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం. ఇందులో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదు.
ప్రశ్న: కడపలో ట్రాఫిక్‌పై చర్యలు
జవాబు: కడపలో ట్రాఫిక్‌పై చర్యలు తీసుకుంటున్నాం. కీలక ప్రదేశాల్లో సిబ్బందిని నియమిస్తాం. కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి సిగ్నల్స్ ఏర్పాటు చేస్తాం.

మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ, జనసేన, బీజేపీలు రాష్ట్ర మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ప్రధానంగా మహిళలకు మూడు హామీలు ఇచ్చాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి నాలుగునెలలు దాటినా ఒక్క హామీ కూడా అమలు కాలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా సరఫరా, 19-59 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థికసాయం పథకాలు అమలు కాలేదన్నారు. వెంటనే ఈ హామీలు నెరవేర్చాలన్నారు.

అర్జీదారుల సమస్యలపై అలసత్వం వద్దు

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యలను అలసత్వం లేకుండా పరిష్కరించాలని లేదంటే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఐసీడీస్ పీడీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి వస్తారన్నారు. వారి సమస్యలను వినడమే కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులకు సంబంధించి సత్వర చర్యలకై సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ 30 సంవత్సరాల నుంచి తమ గ్రామ పొలం సర్వే నెంబరు 538లో తమ ఆధీనంలో ఉండే భూమిని ఇతరుల పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేశారన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప (క్రైం), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు.




డ్రోన్‌లు. ఇది ఇప్పుడు ఏపీలో మారుమోగుతున్న పేరు. ఇవి చాలా ఏళ్ల నుంచి అందుబాటులో ఉన్నప్పటికీ వీటికి అత్యంత ప్రాచుర్యం వచ్చింది మాత్రం ఈ మధ్యనే. ఇటీవల విజయవాడను బుడమేరు ముంచెత్తింది. బాధితులకు సహాయం చేసేందుకు కూడా వెళ్లలేని విధంగా వరద నీరు చుట్టుముట్టింది. అయితే సీఎం చంద్రబాబునాయుడు తన అనుభవానికి పదును పెట్టి డ్రోన్ల ద్వారా వరద బాధితులకు ఆహారం, మెడిసిన్, ఇతరత్రా వాటిని అందించారు. మనుషులు వెళ్లలేని చోటకు డ్రోన్లు వెళ్లాయి. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అడుగులు వేస్తున్నారు. శాంతిభద్రతల్లో డ్రోన్లను వినియోగిస్తున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కడపలో డ్రోన్లను శాంతిభద్రతలకు వినియోగిస్తూ ఎస్పీ తనదైన మార్కును చాటుతున్నారు.



డ్రోన్ నిఘా..!

- శాంతి భద్రతల్లో డ్రోన్ల వినియోగం
- సాంకేతికతను అందిపుచ్చుకున్న కడప పోలీస్
- గంజాయి, పేకాట, అసాంఘిక శక్తులపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక గురి
- 18 ప్రత్యేక టీంల ఏర్పాటు
- వారాంతంలో ఆకస్మిక తనిఖీలు
- జిల్లా మొత్తం సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకువచ్చే యత్నం
- ఫలించిన ప్రయోగం
- ఇప్పటికే రెండు కేసులదర్యాప్తులో పురోగతి



పోలీసులు డ్రోన్‌తో తీసిన ఫొటో



మందుబాబుల అడ్డాలో పోలీసులు



కడపలో లాడ్జిలను తనిఖీ చేస్తున్న పోలీసులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఇప్పటిదాకా జిల్లాలో డ్రోన్లను పంట పొలాలకు మందుల పిచికారీకోసం, రాజకీయ నాయకుల సభల్లో జనాల చిత్రీకరణకు, పెళ్లిళ్లకు వాడుతున్నారు. అయితే ఎస్పీ మాత్రం అసాంఘిక శక్తులను అరికట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నారు. వైసీపీ హయాంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైంది. ప్రత్యర్థులపై కేసులు, ఇతరత్రా వాటికి పోలీసులను వాడుకున్నారు. అందుకే అరాచకశక్తులు రాజ్యమేలాయి. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు దాటింది. ఎస్పీగా హర్షవర్ధన్ రాజు వచ్చి వంద రోజులు కావస్తోంది. ఐదేళ్లపాటు ఒక మూసపద్ధతికి అలవాటు పడిన సిబ్బందిలో ఈయన వచ్చాక చురుకుదనం వచ్చింది. ఉన్న సిబ్బందిలోనే బెస్ట్ బెస్ట్‌గా సెలక్ట్ చేసుకుని టీంలను తయారు చేశారు. గంజాయి నిర్మూలనకు ఒక టైం పెట్టుకుని దాడులు చేస్తున్నారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు.

20 రోజులుగా డ్రోన్లతో పరిశీలన

కడపలో గంజాయి తాగేందుకు కొన్ని అడ్డాలు ఉన్నాయి. శ్మశానాలు, పాడుబడ్డ భవనాలు, బుగ్గవంక పరిసర ప్రాంతం, నిర్మానుష్యప్రాంతాల్లో.. అంటే కొత్త వ్యక్తులు అక్కడికి వెళ్లలేని ప్రాంతాల్లో గంజాయి తాగుతున్నారు. అలాగే మద్యం కూడా సేవిస్తున్నారు. కడపలో శివారు ప్రాంతాల్లో పెద్దఎత్తున గృహాలు వెలిశాయి. ఇక్కడికి పలువురు ఇతరప్రాంతాల నుంచి వచ్చి నివాసం ఉంటున్నారు. వారి నడవడిక ఇతరత్రా తెలుసుకోవడం కోసం పోలీసులు డ్రోన్ ఉపయోగిస్తున్నారు. ఒక్కో డ్రోన్ 2 కి.మీ పరిధిలో తిరగనుంది. 20 రోజుల నుంచి కడప నగరాన్ని డ్రోన్ నిఘాలోకి తీసుకువచ్చారు. అనుమానిత వ్యక్తులు, గంజాయి, బహిరంగంగా మద్యం సేవించే ప్రాంతాలను చిత్రీకరించిన తరువాత వెంటనే అక్కడికి పోలీసు సిబ్బందిని పంపిస్తున్నారు. దీంతో ఇప్పటికే శ్మశానాలు, పాడుబడ్డ ప్రాంతాల్లో తాగుతున్న ఆర్‌కేనగర్, బుగ్గవంక, రిమ్స్‌కు వెళ్లే ప్రాంతంలో గంజాయి బ్యాచ్‌లను అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్లను కమాండ్ కంట్రోలు రూము మానిటరింగ్ చేస్తుంది. ఎక్కడైతే అనుమానితులు ఉన్నారో అక్కడికి క్షణాల్లో పోలీసులను పంపించి గంజాయి బ్యాచ్‌ను అదుపులోకి తీసుకుంటున్నారు. ఆరుబయట మద్యం తీసుకుంటున్న వారిపై కేసులు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 3 డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. ప్రొద్దుటూరు రెండో ముంబై. అక్కడ మాఫియా, క్రికెట్ బెట్టింగ్, రౌడీయిజం, వ్యభిచారం, బెట్టింగులు జరుగుతుంటాయి. అలాంటి చోట కూడా డ్రోన్ ఎగురుతుంది. ఇక జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతాలు అత్యంత సమస్యాత్మకం. ఇవి పేకాటకు కేరాఫ్. గత పోలీసుబాస్‌ల హయాంలో ఇక్కడ రోజూ పేకాట నడిచేది. గోవా తరహాలో గ్యాంబ్లింగ్ ఉండేది. ఇప్పుడు డ్రోన్ల వినియోగంతో అది నిలిచిపోయింది.

సీసీ నిఘాలోకి

విభజిత రాష్ట్రానికి చంద్రబాబు మొదటిసారి సీఎం అయినప్పుడు 2014-19లో జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున సీసీ కెమెరాలు ఉండేవి. జగన్ ప్రభుత్వంలో వాటిని పట్టించుకోకపోవడంతో నిర్వీర్యమయ్యాయి. ఇక కడపలో అయితే రోడ్ల విస్తరణ కారణంగా సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయి. నేరాలు జరగకుండా ఉండాలన్నా జరిగిన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకోవాలన్నా సీసీ కెమెరాలే కీలకం. అయితే జిల్లాలో ఇవన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయి. అన్ని చోట్ల సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలంటే ఆర్థికంగా భారం, సమయమూ పడుతుంది. అందుకే ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తన బుర్రకు పదను పెట్టారు. ప్రస్తుతం ప్రతి వ్యాపార సంస్థ, చాలామంది గృహాల్లో సీసీ కెమెరాలు వినియోగిస్తున్నారు. అవన్నీ వారి దుకాణాలకు, ఇంట్లోకి ఏర్పాటు చేసుకున్నారు. ఎస్పీ ప్రత్యేకంగా టీంలను ఏర్పాటు చేసి వాణిజ్య సంస్థలు, గృహాల్లో ఏర్పాటు చేసుకున్న కెమెరాలను రోడ్డువైపునకు కూడా ఉండేలా వ్యాపారులు, గృహ యజమానులతో మాట్లాడి ఒప్పించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా 1630 చోట్ల రోడ్లపైకి ఉండేలా సీసీ కెమెరాలు మార్చారు.

పట్టుకున్న సీసీ నిఘా నేత్రం

పులివెందులలో వారం క్రితం 11సంవత్సరాల బాలుడిని ఆరుగురు కిడ్నాప్ చేస్తే తప్పించుకుని వచ్చాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. అయితే పోలీసుల సూచన మేరకు అప్పటికే ఓ ఇంటి కెమెరాను రోడ్డువైపునకు మార్చారు. కిడ్నాప్ జరిగిన చోటును ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడి సీసీ కెమెరా ఫుటేజీ చూస్తే బాలుడు దర్జాగా నడుచుకుంటూ పోయే విజువల్స్ కనిపించాయి. దీంతో పోలీసులు ఇది ఫేక్ కేసుగా తేల్చారు.

టీడీపీ నగర అధ్యక్షుడిపై దాడి కేసులో...

కడప టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై రెండురోజుల క్రితం జరిగిన దాడి సంచలనంగా మారింది. సొంత పార్టీ పాలనలోనే ఆయనపై దాడి జరిగింది. ఈ కేసును ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. ఇక్కడ కూడా పోలీసుల సూచనల మేరకు దుకాణదారులు రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారానే దాడి చేసిన వారిని గుర్తించారు. వారం వ్యవధిలోనే రెండు కీలక కేసుల్లో రోడ్డుపైకి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలు కీలకంగా మారడం గమనార్హం.

18 టీంలు ఏర్పాటు

జిల్లాలోకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పేలుడు వస్తువులు, స్మగ్లింగ్, అనుమానిత వ్యక్తులు ఇతరత్రా వాటిని అరికట్టేందుకు ఏఆర్, ఇతర విభాగాల్లో చురుగ్గా ఉన్న 80 మందితో 18 స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలను ఏరాటు చేశారు. శని, ఆదివారం ఒక్కో డివిజనులో ఈ టీంలు అకస్మాత్తుగా తనిఖీలు చేస్తున్నాయి. శనివారం నుంచి ప్రత్యేక బృందాలను రంగంలో దింపారు. లాడ్జిల తనిఖీ, వాహనాల చెకింగ్ చేస్తున్నారు. వీకెండ్‌లో జనం ఎక్కువగా ఉంటారు. దీంతో జిల్లాలో కీలకమైన కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, జమ్మలమడుగులో ఆకస్మిక తనిఖీలు మొదలుపెట్టారు. ఒక టీంను ఒకే ప్రాంతానికి పంపకుండా తరచూ మారుస్తున్నారు. దీని వల్ల అసాంఘిక శక్తులు, అక్రమ దిగుమతులు ఇతరత్రా వాటికి బ్రేక్ పడుతుందంటున్నారు.





కడప నగరంలోని నిర్మానుష్య ప్రదేశాలను పోలీసులు డ్రోన్‌తో తీసిన ఫొటోలు

రాజేశ్ భౌతికకాయాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆర్మీ జవానులు



జవాను రాజేశ్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

వివరాలు 7లో..

పోలీసుల సేవలు అమూల్యం



పోలీసు అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఆరవ అదనపు జడ్జి ఇంతియాజ్ అహ్మద్, ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు

- అమరులైన వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత
- జడ్జి, ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం విధుల్లో ఉండే పోలీసు అధికారులు, సిబ్బంది సేవలు అమూల్యమైనవని జిల్లా 6వ అదనపు జడ్జి ఇంతియాజ్ అహ్మద్ కొనియాడారు. పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అమరులైన వారికి జడ్జితో పాటు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సమాజానికి వెన్నెముక లాంటి పోలీసులు లేకపోతే అరాచకశక్తులు విజృంభిస్తాయన్నారు. ప్రజల ధన మాన ప్రాణాలు కాపాడేందుకు పోలీసులు తమ ప్రాణాలు సైతం అర్పిస్తారన్నారు. విధి నిర్వహణలో ఉంటూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమన్నారు. శాంతిభద్రతలకోసం ప్రాణాలను లెక్కచేయకుండా శ్రమిస్తున్నారని కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు కుటుంబాలకు దూరంగా ఉంటూ రాత్రనక పగలనక విధులు నిర్వహిస్తూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నారని అన్నారు. ఏడాది కాలంలో జిల్లాలో 17 మంది వివిధ కారణాలతో మృతిచెందారని వారి కుటుంబాలకు పోలీసు శాఖ అండగా ఉంటుందన్నారు. అనంతరం విధుల్లో ఉంటూ అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులను సన్మానించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం పోలీసులు వినియోగించే ఆయుధాలను, పోలీసు జాగిలాలను జడ్జి, ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలించారు. వాటి పనితీరును ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రకాశ్‌బాబు, రమణయ్య, డీఎస్పీలు మురళీధర్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్, పోలీసుల అధికారుల సంఘం అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె పాపాఘ్నిలో ఇసుక వివాదం

వేంపల్లె పాపాఘ్ని నది వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయులను మందలిస్తున్న సీఐ సురేశ్‌రెడ్డి



వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టడంతో వేంపల్లె పాపాఘ్నిలో ఇసుక ట్రాక్టర్ల జాతర జరుగుతోంది. పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో మమ్మల్ని తోలనీయలేదు ఇపుడు ఎలా తోలుతారు అంటూ టీడీపీ నేతలు వైసీపీ నేతల ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీనికి తోడు నీటి బోర్లు, ఫిల్టర్ల సమీపంలోంచి ట్రాక్టర్లతో ఇసుక తోలుతున్నారని ఇలా అయితే నీటి సమస్య వస్తుందని అన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. విషయం తెలుసుకున్న సీఐ సురేశ్‌రెడ్డి పాపాఘ్ని నది వద్దకు వెళ్లి టీడీపీ, వైసీపీ వారితో చర్చించారు. ట్రాక్టర్లను అడ్డుకునే హక్కు ఎవరికి లేదని హితవు చెప్పారు. నీటి బోర్ల సమీపంలోకివెళ్లొద్దని సూచించారు. పై ప్రాంతంలో ఉన్న ఇసుకను మాత్రమే తరలించుకోవాలన్నారు. దీంతో తాత్కాలికంగా వివాదం సమసిపోయింది. ఈ విషయంపై తహశీల్దార్ హరినాథ్‌రెడ్డితో సీఐ చర్చించారు.

ఇటుకల బట్టీలకు తరలిస్తే చర్యలు

వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుకను ట్రాక్టర్లతో ఇటుక బట్టీలకు తరలిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. వాణిజ్య అవసరాలకు పర్మిట్లు తీసుకుని ఇసుకక్వారీల నుంచి మాత్రమే ఇసుకను తెచ్చుకోవాలని సూచించారు. గృహ అవసరాలు, ఇతర అభివృద్ధి పనులకు మాత్రమే ఇసుకను తోలాలని అన్నారు. ఎక్కడైనా ఇసుకను డంప్‌చేసి దూరప్రాంతాలకు తరలించినట్లు తెలిస్తే కేసులు నమోదుచేస్తామని సీఐ హెచ్చరించారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కడపలోని పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ తదితరులు



ఏఎస్ఐ నాగార్జునరెడ్డి కుటుంబానికి బహుమతి అందచేస్తున్న ఆరవ అదనపు జడ్జి ఇంతియాజ్ అహ్మద్, ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, అప్సర్ అహ్మద్ కుటుంబాలకు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ డి.మల్లికార్జున, ఏఆర్ కానిస్టేబుళ్లు ఆర్.క్రిష్టయ్య, విజయకుమార్, సురేష్ కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఎస్ఐ ఎస్‌డీ జాకీర్‌హుస్సేన్ కుటుంబానికి కుట్టుమిషన్, హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ అమర్‌నాథ్ కుటుంబానికి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి, ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబానికి, ఏఆర్ కానిస్టేబుల్ వేదవతి కుటుంబంలో చిన్నారికి సైకిల్, కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబానికి బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, తదితరులు

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, ఎస్డీసీ రామసుబ్బయ్యలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందించిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రభుత్వం చాలా దృష్టి పెడుతోందని, సీఎం కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రీవెన్స్‌ను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మండల, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో కూడా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పకడ్బందీగా నిర్వహించి చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



గంగులమ్మ (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనం, అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, అమ్మ చెరువుమిట్టకు చెందిన గంగులమ్మ (48) నీరుగట్టు వారిపల్లెలో టమోటా మార్కెట్ యార్డులో దినసరి కూలీగా పనిచేస్తూ జీవిస్తోంది. తన కుమార్తె రమాకు వివాహం చేసింది. వారు విడిగా కాపురం ఉంటున్నారు. 30 ఏళ్ల క్రితం భర్త చనిపోయాడు. అనారోగ్యం, ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. సోమవారం ఉదయం తన కుమార్తె రమా ఇంటివద్దకు వెళ్లి చూడగా ఉరివేసుకున్నట్లు గుర్తించి కేకలు వేసింది. వెంటనే స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు మృతదేహాన్ని శవ పంచనామా కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కురబలకోటకు చెందిన వాణి అనే మహిళపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడంతో పాటు రూ.3 లక్షలు డిమాండ్ చేసి ఇవ్వకుంటే చంపేస్తామంటూ బెదిరించిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ రమేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కురబలకోటకు చెందిన వాణి అనే మహిళ చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేస్తోందని, సోషల్ మీడియాలో సుజాతరాణి అనే మహిళ పోస్టులు చేస్తూ దుష్ప్రచారం చేసిందని, రూ.మూడు లక్షలు డిమాండ్ చేసిందని, లేకపోతే చంపేస్తామని బెదిరించినట్లు ముదివేడు పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు సుజాతరాణితో పాటు సహకరించిన మదనపల్లెకు చెందిన నాగమణి, కురబలకోటకు చెందిన దేవ, తిరుపతికి చెందిన లక్ష్మీకళ అలియాస్ చంద్రకళలపై కేసు నమోదు చేశారు. కాగా సుజాత రాణి, దేవలు పాతనేరస్థులని సీఐ చెప్పారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని నడింపల్లె పంచాయతీ కమతంపల్లెలోని రాగిమాను రచ్చ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8450 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుకను బొక్కేశారు..!



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో డంపు చేసిన ఇసుక (ఫైల్ ఫొటో)



జెట్టివారిపల్లె సమీపంలో ఇసుకను అక్రమంగా డంప్ చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

- జప్తు చేసిన ఇసుకపై కన్ను
- కోట్లు వెనకేసిన గత పాలకులు
- తప్పు చేసిన వారిపై చర్యలేవీ !
- ప్రత్యేక పోలీసు నిఘా ఉంచినా ప్రయోజనం నిల్
- రెవెన్యూ అధికారుల అండదండలే కారణమా ?
- చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధుల డిమాండ్

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుకను బొక్కేశారు. రూ.కోట్లు వెనకేసినా సంబంధిత అధికారులు అటువైపు చూడలేదంటే నమ్మశక్యం కాదు. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నా అటు పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా ఇసుకను తరలించుకుని సొమ్ము చేసుకున్నారు. కానీ అధికారులు మాత్రం వారిపై కేసులు నమోదు చేయలేదనే విమర్శలున్నాయి. గత వైసీపీ పాలనలో మండలంలోని మల్లెల గ్రామంలోని సంపతికోట ఏటిలో గత 2022వ సంవత్సరంలో స్థానిక ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో స్థానిక బూర్లపల్లె సర్పంచ్ ఆ ఏటిలో రాత్రికి రాత్రే భారీ యంత్రాలను ఉపయోగించి ఇసుకను భారీగా డంప్ చేశారు. ఈ విషయంపై పలు పత్రికల్లో వార్తలు రావడంతో డంప్ చేసిన ఇసుకను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసి స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా టి.సదుం పంచాయతీ రామాపురం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా తరలించి సుమారు 10 వేల టిప్పర్ల ఇసుకను 2024 ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే మొత్తం ఇసుకను రాత్రికి రాత్రే టిప్పర్లతో కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు చెబుతున్నారు.

భారీగా కర్ణాటకకు ఎగుమతి

టి.సదుం పంచాయతీలో చెన్నరాయుని పల్లె సమీపంలో ఉన్న పాపాఘ్నినదిలో ఇసుక డంప్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా రెవెన్యూ అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే లారీల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నారు. కనీసం గతంలో కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డ ఇసుక లారీలను స్థానికులు పట్టించినా అధికారులు ఎమ్మెల్యే అండదండలతో ఆ లారీలను వదిలేసేవారని ఆరోపణలున్నాయి. దీంతో ఇసుక అక్రమ రవాణా గత ప్రభుత్వంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది.

అధికారుల అండతో అమ్మేశారు

పెద్దతిప్పసముద్రం మండలం, మల్లెల గ్రామానికి సమీపంలోని అంకిరెడ్డిపల్లె, ఆవులరెడ్డిపల్లె సమీపంలో సంపతికోట ఏటి వాగు ఉంది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సర్పంచ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధి, రాజంపేట పార్లమెంట్ ప్రజాప్రతినిధి అండదండలతో ఏటిలో మొత్తం ఇసుకను యంత్రాల సహాయంతో భారీగా డంప్ చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక నాయకులు అప్పట్లో లోకాయుక్తాకు సైతం ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన లోకాయుక్త ఆ ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించి సీజ్ చేసిన ఇసుకపై తమకు నివేదికను అందించాలని కోరింది. అయితే లోకాయుక్తాను సైతం లెక్క చేయకుండా అప్పటి స్థానిక తహసీల్దార్ బూర్లపల్లె సర్పంచ్‌తో చేతులు కలిపి జప్తు చేసిన ఇసుకను పూర్తిగా అమ్మేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

జప్తు చేసిన ఇసుకపై స్థానికుల ఫిర్యాదు

గతంలో జప్తు చేసిన సుమారు 600 లోడ్ల ఇసుకను అమ్మేశారని బూర్లపల్లె గ్రామానికి చెందిన స్థానికులు రెవెన్యూ అధికారులకు, సబ్ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఇంతవరకు ప్రయోజనం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక వీఆర్వో, వీఆర్ఏల అండదండలతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ అవసరాలకు ఇచ్చామంటూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జప్తు చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగించారా లేక రెవెన్యూ అధికారుల అండదండలతో అమ్మేశారా అనే కోణంలో విచారణ చేపట్టి తప్పుచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే అనుమతులిచ్చాం

- విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్

మండలంలో అప్పట్లో ప్రభుత్వ భవనాలకు అధికారుల ఆదేశాల మేరకే ఇసుకను కేటాయించాం. మండలంలో ఎవ్వరికి అనుమతులు లేకుండా ఇవ్వలేదు. ప్రభుత్వ పనులకు మాత్రమే ఇచ్చాం. అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకున్నాం.



టి.సదుం పంచాయతీ రామాపురం ఇసుక రీచ్‌లో డంప్ చేసిన ఇసుకను టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ పోలీసులు (ఫైల్)

హత్యకేసులో ముగ్గురు నిందితులు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): కురబలకోట డంపింగ్‌యార్డు వద్ద శనివారం జరిగిన హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా కురబలకోటకు చెందిన సులేమాన్ కువైత్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అతనికి ఉన్న పొలాలను చూసుకునేందుకు గానూ ఖాదర్‌బాషాను పనిలో పెట్టుకున్నాడు. ఇందుకు అతనికి నెలకు రూ.15 వేలు ఇచ్చేవాడు. అయితే సులేమాన్ ఇండియాలో లేని కారణంగా అతని భార్యకు హత్యకు గురైన ఖాదర్‌బాషకు అక్రమ సంబంధం ఉన్నట్లు గ్రామంలో పుకార్లు, షికార్లు చేశాయి. దీంతో సులేమాన్ 15 రోజుల క్రితం ఇండియాకు వచ్చాడు. తన పొలం పనులను చూసుకునేందుకు తన సమీప బంధువు కల్లూరు అబ్దుల్ రహీంను పనిలో పెట్టుకొని, ఖాదర్‌బాషను పనిలో నుంచి తొలగించాడు. దీంతో జీవనోపాధి కోల్పోవడంతో మృతుడు తీవ్ర ఆవేదన చెందాడు. ఈ నేపథ్యంలోనే అబ్దుల్ రహీంను, వారి కుటుంబ సభ్యులను మృతుడు కురబలకోట బస్టాండ్‌లో కించపర్చే విధంగా తిట్టాడని, బంధువర్గంలో పరువు మర్యాదలు కోల్పోతున్నామని భావించారు. ఈ క్రమంలో కురబలకోట మండలం, గడ్డంవీధికి చెందిన సులేమాన్, కోటవీధికి చెందిన అబ్దుల్ రహీంలు కుట్రపన్ని శుక్రవారం కురబలకోట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌తో కలిసి మద్యం సేవించి హత్యకు పన్నాగం పన్నారు.

శుక్రవారం రాత్రి 7.45 సమయంలో ఖాదర్‌బాష ఇంటి వద్ద కాపుకాశారు. మసీదుకు తన తండ్రి వెంట వెళుతున్న ఖాదర్‌బాషను మాట్లాడే పనిఉందని అబ్దుల్‌రహీం, అరుణ్ కుమార్‌లు వారి ద్విచక్ర వాహనంపై ఎక్కించు కున్నారు. కురబలకోట డంపింగ్‌యార్డు వద్దకు తీసుకెళ్లి తాము తెచ్చుకున్న కత్తులతో గొంతుపై పొడిచి, అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డురావడంతో కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. కురబలకోట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సమాచారం తెలుసుకున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు పర్యవేక్షణలో మదనపల్లె రూరల్ సీఐ రమేష్, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కురబలకోట మండలం, యర్రపల్లె పంచాయతీ, బాపనపల్లె వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చూపి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వారు హత్యకు వాడిన రెండు కత్తులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు 27 మంది ఎంపిక

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మండలాల నుంచి జిల్లా స్థాయి పోటీల్లో 27 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో సోమవారం మహల్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 15 మంది బాలురు, 12 మంది బాలికలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నవంబరు 6, 7 తేదీల్లో మొలకలచెరువు ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలు జరుగనున్నాయి.

బాలుర విభాగంలో

డి.లక్ష్మీనరసింహారెడ్డి, ఎం.హేమంత్, ఐ.భరత్, టి.దిలీప్, సి.చరణ్‌రాజ్, కె.పవన్, ఎస్.వెంకట్, యు.అఖిల్, కె.ఎస్.దర్శన్, జి.నాగమల్లేష్, వి.పార్థీవ్ రత్నం, ఎం.బాలాజీ, కె.రంజిత్, ఎస్.ఉమర్, పి.సతీష్, టి.హర్షవర్ధన్‌లు.

బాలికల విభాగంలో

ఇ.లక్ష్మి, బి.పూజిత, డి.శ్రీలక్ష్మి, ఎస్.లక్ష్మీప్రియ, ఎస్.వి.జూలీ, కె.నయనశ్రీ, ఎస్.తనుశ్రీ, జి.నీహారిక, ఎ.రేఖాశ్రీ, ఎస్.కల్పన, పి.యామిని, దేవీప్రియలున్నారు. పోటీల నిర్వహణలో మహల్ హెచ్‌ఎం ఎస్.చెంగ్రాలా యులు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు నిజాముద్దీన్, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంతమ్మ, సహాయ కార్యదర్శి నాగరాజ, మహల్ పీడీ ఎస్.రియాజ్ అహ్మద్, మాజీ సర్పంచు టీడీపీ నాయకుడు మహ్మద్‌అలీ, జిల్లాలోని పలువురు సీనియర్ పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

కలకడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ పెమినేనివాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ అదే గ్రామానికి చెందిన మల్లికార్జునకు కొంతకాలంగా భూతగాదాలున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న వెంకటరమణపై మల్లికార్జున్, వరుణ్‌లు గాయపరిచినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గాలేరు-నగరి ఈఈ శ్రీనివాసులుకు పదోన్నతి

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి కడప సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న కె.శ్రీనివాసులుకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన సూపరింటెండెంట్ ఇంజినీరుగా పదోన్నతి పొందారు. శ్రీనివాసులును జల వనరులశాఖ కడప సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా టీవీ రమణ

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా కలికిరికి చెందిన టీవీ రమణను నియమించారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సి. కుసుమకుమారి సోమవారం రమణకు నియామకపత్రం అందజేశారు. గతంలో ఈయన జిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన సంఘం జిల్లా పదవి అప్పగించింది. మాలల సంక్షేమం, అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తానని ఈ సందర్భంగా రమణ తెలియజేశారు.

కరోనా... ఏం మాయ చేసిందో..!


కొండాపురం రైల్వేస్టేషన్

- కళావిహీనంగా మారిన కొండాపురం రైల్వేస్టేషన్
- స్టాపింగ్‌కు నోచుకోని రైళ్లు
- గతంలో నడిచిన అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- ఆందోళనలు చేసినా.. పట్టించుకోని రైల్వేశాఖ

కొండాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి ఏం మాయ చేసిందో ఏమో కానీ కొండాపురం రైల్వేస్టేషన్ కళావిహీనంగా మారింది. బ్రిటీష్ కాలం నుంచి ఓ వెలుగు వెలిగిన ఈ రైల్వేస్టేషన్ ప్రస్తుతం వెలవెలబోతోంది. గతంలో ఈ స్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లకు స్టాపింగ్ ఉండేది. కరోనా మొదలైనప్పటి నుంచి


రైళ్లు నిలుపుదల చేయాలంటూ ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు (ఫైల్‌ఫొటో)

రెండు రైళ్లు మినహా అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారు.ప్రస్తుతం దర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, తిరుపతి-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉంది. గతంలో కొండాపురం స్టేషన్‌లో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారు.దీంతో కొండాపురంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న సింహాద్రిపురం, యల్లనూరు, తొండూరు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ రైళ్లు ఆగేదెప్పుడో...

కరోనా మహమ్మారి రాక ముందు హైదరాబాద్-తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై-ముంబైల మధ్య నడిచే దాదర్ ఎక్స్‌ప్రెస్, మెయిల్ ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి-ముంబైల మధ్య నడిచే జయంతి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు తిరుపతి-ముంబైల మధ్య నడిచే బాలాజీ ఎక్స్‌ప్రెస్‌లకు కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఉండేది. వీటన్నంటిని పునరుద్ధరించాలని గతంలో వామపక్షాలు, ప్రజసంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో కేవలం ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను మాత్రమే ఆపుతున్నారు. అన్ని రైళ్లను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గతంలో, ప్రస్తుతం కూడా లేఖ ఇచ్చారు. అయినా రైల్వేశాఖ నుంచి ఇంతవరకు స్పందన లేదు. వెంటనే అన్ని రైళ్లను పునరుద్దరించేలా ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే మంత్రిని కలిసినా...



కొండాపురంలో రైళ్ల స్టాపింగ్ కోసం గతంలో ఎంపీగా ఉన్న రఘరామకృష్ణమరాజుతో కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వనివైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు తాను రైల్వేబోర్డులో పలుసార్లు అధికారులను కలిసినా ఇంతవరకు రైల్వే అధికారులు స్పందిచడం లేదు. ప్రయాణికుల సౌకర్యం చూడకుండా వారు ఏవేవో సాకులు చెబుతున్నారు. అయినప్పటికీ మరోసారి ఎమ్మెల్యేతో కలిసి రైల్వే అధికారులపై ఒత్తిడి తెచ్చి రైళ్ల ఆపేందుకు ప్రయత్నిస్తాం.

-దేవగుడి శివనారాయణరెడ్డి, మాజీ జడ్‌ఆర్‌యూసీసీ మెంబర్

అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి



గతంలో స్టాపింగ్ ఉన్న రైళ్లకు కొండాపురంలో స్టాపింగ్ ఎత్తివేశారు.నాలుగు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడంలేదు. మేం గతంలో నిరాహార దీక్ష చేపట్టడానికి సిద్ధం కావడంతో కేవలం ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును మాత్రమే ఆపుతున్నారు. గతంలో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు తిరిగి కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలి. లేకుంటే మరోసారి ఆందోళనకు దిగుతాం.

-ఎం.మనోహర్‌బాబు, సీపీఐ మండల కార్యదర్శి, కొండాపురం

నీళ్ల కోసం పేరెన్నిక గల స్టేషన్


కొండాపురం రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నీళ్లు నింపుతున్న దృశ్యం

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. కర్నూలు జిల్లా మంత్రాలయం తర్వాత కొండాపురం రైల్వేస్టేషన్‌లోనే రైళ్లకు నీళ్ల నింపేవారు. మంత్రాలయం దగ్గరలో తుంగభద్ర నది నుంచి రైళ్లకు నీళ్ల నింపుతుండగా, కొండా పురం పక్కనే ఉన్న చిత్రావతి నది నుంచి రైళ్లకు నీళ్ల నింపేవారు. ఇందుకోసం చిత్రావతి నది నుంచి ప్రత్యేక పైపులైనును కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు మాత్రమే కొండాపురంలో నీళ్ల నింపుతున్నారు. ప్రతిరోజు విశాఖపట్నం-కడప మధ్య నడిచే ఈ రైలు కొండాపురం రైల్వేస్టేషన్‌కు కేవలం నీళ్ల నింపుకోవడానికే కడప నుంచి కొండాపురం వస్తుంది. రైల్వేస్టేషన్‌లో సుమారు నాలుగు గంటలు హోల్టింగ్ ఉంటుంది. ఈ సమయంలో ఈ రైలుకు క్లీనింగ్ చేయడంతో పాటు నీళ్ల నింపుతారు. ఈ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు కొండాపురం నుంచి విశాఖపట్నం బయలుదేరుతుంది. కొండాపురం నుంచే ఈ రైలు మొదలవుతున్నా స్టేషన్‌లో ఈ రైలుకు టికెట్లు ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై స్థానికులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకుకెళ్లగా.. ఇందుకు స్పందించి రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే ఇక్కడినుంచే స్టాపింగ్, టికెట్లు ఇచ్చి ప్రయాణీకులను ఎక్కించుకోవాలని కోరినా ఇంతవరకు స్పందన లేదు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు


గంగనపల్లెలో మొలకలు వచ్చిన మినుము కుప్పలను పరిశీలిస్తున్న ఏవో జయలక్ష్మి

కాశినాయన, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వరి, మినుము, మిరప, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. దీనిపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఎడతెరిపిలేని వర్షం... దెబ్బతిన్న పంటలు అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సమగ్రంగా పంపాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమేరకు సోమవారం మండల వ్యవసాయాధికారి జయలక్ష్మి, విస్తరణాధికారి ధనలక్ష్మీ గంగనపల్లె, ఇటుకులపాడు తదితర గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట నివారణకు రైతులకు సూచనలు ఇవ్వడంతో పాటు జరిగిన పంట నష్టంపై రెండు రోజుల్లో జిల్లా అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

ఏపీ డీజీపీని కలిసిన వేమన సతీష్



రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్ విజయవాడ డీజీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో అవినీతి అక్రమాలపై, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఇంకా పలు సమ స్యలపై ఆయనతో చర్చించారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, మహేశ్‌బాబు


విజయకుమార్, మహేశ్‌బాబు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, మహేశ్ బాబులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన స్వర్ణోత్సవాల సభ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నాగార్జునరెడ్డి, సహాయ అధ్యక్షుడిగా వై.రవికుమార్, సుజాతారాణి ట్రెజరర్‌గా కె.నరసింహారావు, కార్యదర్శులుగా శ్రీనివాసులు, డీవీ రవీంద్రుడు, చెన్నయ్య, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, మురళీక్రిష్ణ, ఎల్.చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, టి.శివప్రసాద్‌లను ఎంపిక చేశారు.

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా క్రిష్ణప్రసాద్


ఎంవీక్రిష్ణప్రసాద్, రామాంజనేయరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంవీ క్రిష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శి రామాంజనేయరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరం పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపిక పట్ల పీఆర్‌టీయూ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రామ్మూర్తి, కె.శ్రీనివాసులు, నరసింహులు, ఆంజనేయులు, బాబురెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



పెండ్లిమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొలతల ఘాట్‌రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ.మిథున్‌రెడ్డి (27) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే.... మండలంలోని మాచునూరు పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన మిథున్‌రెడ్డి పొలతల క్షేత్రంలో దైవ దర్శనం ముగించుకొని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ని ఓవర్ టేక్ చేసి ముందుకువెళ్లిన వెంటనే బైక్ అదుపు తప్పడంతో ట్రాక్టర్ కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లిలోని కందిపాలెంలో సోమవారం ఓ వృద్ధుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. కందిపాలెంకు చెందిన నంద్యాల కృష్ణ (62) బెల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. సోమవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం కొరకు మృత్యదేహన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో దుండగులు..?

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షుడు శివాకొండారెడ్డిపై దాడి చేసిన దుండుగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం టీ తాగి ఇంటికి వెలుతున్న అయనపై యువకులు కర్రలతో కొట్టి ద్విచక్ర వాహనంలో పారిపోయారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులో ఉన్న వారిలో ఒకరిపై రౌడీషీట్ ఉన్నట్లు తెలుస్తోంది. శివకొండారెడ్డిపై దాడికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంటుంది

హెయిర్ కటింగ్ సెలూన్లపై రాళ్లదాడి

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల సెలూన్ షాప్‌లపై గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు సమీపంలో గల రవి హెయిర్ కటింగ్ సెలూన్‌కు చెందిన రవికిశోర్‌రెడ్డి, ప్రసాద్, తులసీ, ప్రసన్నకుమార్‌లు ఆదివారం రాత్రి మద్యం మత్తులో తమ వ్యాపారాలకు అడ్డుగా వస్తున్నారన్న కోపంతో చీఫ్ అండ్ బెస్ట్ సెలూన్ షాప్, టాయ్ అండ్ గాయ్ సెలూన్‌షాప్‌లపై వాహనంలో వెళ్లి రాళ్లదాడి చేసి అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. ఈ దాడిలో షాప్‌లోని అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని షాప్‌లోనే సీసీ టీవీ పుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

దళితులపై అగ్రవర్ణాల దాడి.. ఎస్సీ ఎస్టీ కేసు

ఓబులవారిపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లె కమ్మపల్లె హరిజనవాడ దళితులపై కాకర్లవారిపల్లెకు చెందిన అగ్రవర్ణాలవారు దాడికి పాల్పడటంతో ఎస్సీ ఎస్టీ యాక్టు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు అగ్రవర్ణాలవారు ప్రయత్నించగా అడ్డుకోవడానికి వెళ్లిన దళితులపై దాడి చేసినట్లు తెలిపారు. పి.కమ్మపల్లె గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా.. అడ్డుకో వడానికి యత్నించిన హరిజవాడకు చెందిన పి.కృష్ణయ్య, మరో వ్యక్తిపై కర్రలతో దాడి చేశారు. కాగా వీరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. దాడికి పాల్పడిన కాకర్లవారిపల్లెకు చెందిన కస్తూరి వెంకటేశ్వర్ నాయుడు, శివయ్య నాయుడు, కోటయ్యనాయుడు, ఉమా, మరొకరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(వినాయకనగర్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు 2024-25కు సంబంధించి ఈ నెల 30వ తేదీ లోపు ఆయా కళాశాలల జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తులను సాంఘీక సంక్షేమశాఖ కడప వారికి ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. కళాశాలలో చదువుతున్న ఎస్టీ విద్యార్థులందరూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐపీపీబీ ఖాతాను పోస్టాఫీసులో తెరవాలని కోరారు. పోస్టుమెన్ సహకారంతో ఆయా కళాశాలల్లో ఐపీపీబీ క్యాంపు నిర్వహించాలన్నారు. ఎస్టీ విద్యార్థులకు ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ అవసరం ఉంటుందన్నారు. ఎన్‌పీసీఐ ద్వారా స్కాలర్‌షిప్‌లు నేరుగా అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. నగదును తీసుకోవడానికి పోస్టాఫీసు ద్వారా కానీ, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కానీ అవకాశం ఉంటుందని తెలిపారు.

జవాను రాజేశ్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు


అంత్యక్రియల సందర్భంగా గాలిలోకి తుపాకీ పేల్చి జవానుల గౌరవవందనం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని నక్సల్స్ అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి మృతి చెందిన జవాను కొడవటికంటి రాజేశ్‌కు సోమవారం ఆర్మీ సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జవాను రాజేశ్ ఇంటి నుంచి అంతిమయాత్ర ప్రారంభం కాగా.. దారి పొడవునా రాజేశ్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. గ్రామ శ్మశానవాటిక వద్దకు చేరుకోగా.. రాజేశ్ భార్య స్వాతి. తల్లిదండ్రులు జానయ్య బాలమ్మ పలువురు కుటుంబసభ్యులు భౌతికకాయం వద్ద బోరున విలపించగా అందరూ కంటి తడిపెట్టారు. ఇండో టిబెటన్ బోర్డరు పోలీసులు, ఐటీబీపీబీఎస్‌ఎఫ్ సిబ్బంది అంత్యక్రియలకు హాజరై రాజేశ్‌ను కడసారి చూసి నివాళ ర్పిం చారు. అనంతరం గౌరవ వందనం చేసి సంతాపం సూచకంగా గాలిలో కాల్పులు జరిపి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు అడిషనల్ అసిస్టెంటు కమాం డెంట్ దితేంద్రసింగ్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బ్రహ్మంగారి మఠం ఎస్‌ఐ చంద్రశేఖర్, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, తహ సీల్దారు దామోదర్‌రెడ్డి, బద్వేలు డివిజను ఆర్డీవో చంద్రమోహన్, గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రాజేశ్‌కు నివాళులర్పించారు. రాజేశ్ భౌతికకా యానికి ఉదయం కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి, టీడీపీ నేతలు యల్లటూరు సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, చిలమల నాగయ్య, ఎస్‌ఆర్ శ్రీనివాసరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, పూజా శివాయాదవ్ తదితరులు సంద ర్శించి రాజేశ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జన్ సురక్ష పథకాలపై అవగాహన పెంచాలి : కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో జన్ సురక్ష పథకాల (పీఎంజేబీవై, పీఎంఎస్‌బీవై)పై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ప్రత్యేక జిల్లాస్థాయి (డీఎల్‌ఆర్‌సీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని బ్యాంకులకు నిర్ధేశించిన జన్‌సురక్ష పథకాలపై అవగాహన, అమలుపై బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత ధృడంగా ఉంటుందన్నారు. జన్‌సురక్ష బీమా యోజన పథకాల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈపథకా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు సంతృప్తిస్థాయిలో అర్థమయ్యేలా అవగాహన పెంచాలన్నారు. ప్రభుత్వాలు పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అన్ని రకాల బ్యాంకు రుణాలను అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజరు జనార్ధన్, డీపీవో రాజ్యలక్ష్మి, డీఆర్డీఏపీడీ ఆనంద్ నా యక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసు విచారణ కోసం వచ్చిన వ్యక్తి మృతి

- స్టేషన్ ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



స్టేషన్ ఎదుట దేవరాజు మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

సంబేపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం కొండావాండ్లపల్లికి చెందిన దేవరాజు (60) సోమవారం కేసు విచారణ కోసం వచ్చి ఒక్కసారిగా ఛాతి నొప్పి రావడంతో కుప్ప కూలి పడిపోయాడు. అతడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిరారించారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ సంబేపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. రాయచోటి రూరల్ సీఐ సంఘటన విషయాన్ని తెలుసుకొని హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. దేవరాజు కుమార్తె జ్యోతి ఆడబిడ్డ అంజనమ్మ పోలీసు స్టేషన్‌లో బంగారు విషయంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణకు పిలిపించినట్లు తెలిపారు. అతను హార్ట్ పేషెంట్ కావడంతో ఛాతి నొప్పి వచ్చినట్లు మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ విషయంపై స్టేషన్‌లో జరిగిన విచారణ సంఘటనపై సీసీ పుటేజులను ఒకసారి పరిశీలించమని రూరల్ సీఐ వరప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులను కోరారు. మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో ఈ లోపే రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ సంబేపల్లెకు చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి సీసీ పుటేజీలను పరిశీలించాలని కోరారు. దీంతో కుటుంబ సభ్యులు సీసీ పుటేజీలను పరిశీలించి ఆందోళన విరమించారు. ఫిర్యాదు చేసిన వారి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని.. తమకు ఏమి జరిగినా వారిదే బాధ్యత అని డీఎస్పీ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ విషయంపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఛాతి నొప్పితోనే మృతి చెందాడు : డీఎస్పీ

సంబేపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన అంజనమ్మ బంగారు విషయంపై ఫిర్యాదు మేరకు దేవరాజును స్టేషన్‌కు పిలిపించారు. అతడికి ఛాతినొప్పి రావడంతో రాయచోటి ఆసుపత్రికి తరలించగా.. గుండె నొప్పితో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. స్టేషన్‌లో జరిగిన సీసీ పుటేజి మృతుని కుటుంబ సభ్యులకు చూపించడంతో వారు శాంతించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారని డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి

కడప రూరల్, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై గ్రామ, మండలస్థాయి అధికారులు తగు అవగాహనను పెంపొందించుకొని అందులోని సెక్షన్ల ప్రాధాన్యతను తెలుసుకోవాలని కడప మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప మండల వ్యసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 6,7(1) ప్రకారం, దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో సమాచారాన్ని పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉందన్నారు. సెక్షన్ 4(1) ప్రకారం కార్యాలయ ఆవరణంలో సమాచార హక్కు బోర్డును ఏర్పాటుచేసి అందులో పౌర సమాచార అధికారి, సహాయ అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లతో పాటు వారి హోదా, మొబైల్ నెంబర్ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు. అలాగే సెక్షన్ 7,8,9,19(1)ల గురించి తెలియజేశారు.

'బాలిక మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి'

కమలాపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : బద్వేలులో మైనరు బాలికపై పెట్రోలు పోసి నిప్పు పెట్టి బాలిక మృతికి కారణమైన ప్రేమోన్మాది విఘ్నేశ్‌ను కఠినంగా శిక్షించాలని, బాధిత విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కమలాపురం ఏఎస్ఎఫ్ఐ నాయకులు కోగటం షేక్‌సాదిక్, సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మహిళలపై నిత్యం దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయన్నారు. దేశంలో బలమైన చట్టాలు లేకపోవడంతో ని త్యం మహిళలు, విద్యార్థినులపై అనేక రూపాల్లో దాడులు పెరుగుతున్నాయన్నారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ప్రేమోన్మాది విఘ్నేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హేమంత్, శ్రీకాంత్, రెడ్డయ్య, ఇలియాస్, నితీష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పులివెందుల రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్‌రెన్యువల్స్‌కు సంబంధించి స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని పులివెందుల అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారి (ఏఎస్‌డబ్ల్యూఓ) రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు వెంటనే జ్ఞానభూమి వెబ్‌సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

శనగల పంపిణీ

వేముల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వేములలో సబ్సిడీ శనగలు సోమవారం పంపిణీ చేశారు. పులివెందుల సహాయవ్యవసాయ సంచాలకులు ప్రాకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి చేతుల మీదుగా పంపిణీచేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిని ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి సోమవారం పరామర్శించారు. నిందితులకు శిక్ష పడేలా చేస్తామని శివకొండారెడ్డికి భరోసా ఇచ్చారు. అనంతరం బద్వేలులో మృతిచెందిన బాలిక కుటుంబ సభ్యులను కూడా ఆమె పరామర్శించారు.

దిగొచ్చిన ఇసుక ధర

వేంపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించడంతో వేంపల్లెలో ఇసుక ధరలు దిగివచ్చాయి. నిన్నమొన్నటి వరకు వేంపల్లె పట్టణంలోకి ట్రాక్టర్ ఇసుక రూ.1500 నుంచి రూ.2000 వరకు దూరాన్ని బట్టి మరింత ఎక్కువ ఉండేది. ఇసుక టట్రాక్టర్లతో ఉచితంగా తోలుకోవచ్చని సీఎం చంద్రబాబు చెప్పిన నేపథ్యంలో ఇసుక కోసం పెద్దఎత్తున ట్రాక్టర్లు రంగంలోకి దిగాయి. పోటీ ఏర్పడడంతో వేంపల్లె పట్టణంలోకి ప్రస్తుతం ఇసుక ధర రూ.1000కే తోలుతున్నారు.

ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాచారం ఇవ్వాలి

పెండ్లిమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా సమాచారం అడిగిన దరఖాస్తుదారుకు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన పెండ్లిమర్రి ఏఓ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సహాయకులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ 6,7 (1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



దివ్యాంగుడికి దుప్పట్లు అందిస్తున్న హాజీవల్లి

పులివెందుల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రజల ధన, మాన ప్రాణరక్షణ కోసం అహర్నిశలు శ్రమించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పులివెందుల ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హాజీవల్లి అన్నారు. పోలీసు అమవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం 30 మంది దివ్యాంగులకు హాజీవల్లి దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రాణాలర్పించిన పోలీసుల ఆత్మశాంతి కోసం వారు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం దివ్యాంగులకు స్వీట్లు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథ్‌రెడ్డి అధ్యక్షత వహించారు.

వీరపునాయునిపల్లె: పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులఅర్పించారు. పోలీస్ సిబ్బంది, సచివాలయ, పోలీస్ మహిళా కార్యదర్శులు, ప్రజలతో కలిసి ఎస్ఐ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఉపాధి అవకాశాలు కల్పించండి

కడప మారుతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మందికి పాలక ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అ వసరం ఉందని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. గత వైసీపీ పాలనలో అమలు చేసిన చేదోడు, తోడు, వాహనమిత్ర పథకాలను కొద్ది మందికి మాత్రమే వర్తింపజేసి చేతులు దులుపుకున్నారన్నారు. వాటిని అర్హులందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

పైడికాల్వ వద్ద ఇసుక రీచ్ ప్రారంభం

వల్లూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పైడికాల్వ పాపాఘ్నినది వద్ద ఇసుక రీచ్‌ను తహసీల్దారు శ్రీవాణి ప్రారంభించారు. సోమవారం పైడికాల్వలోని ఇసుక క్వారీ వద్ద ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అనంతరం వారు మా ట్లాడుతూ కేవలం సీనరీ చార్జ్ మాత్రమే ఆన్‌లైన్‌లో కానీ మీ సేవలో కానీ సచివాలయంలో కానీ కట్టి తీసుకెళ్లవచ్చని అన్నారు. ఉదయం 6గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం నుంచి ఇక్కడనే చలానా కట్టి తీసుకోవాలని సూచించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాదిరి కాకుండా ఈ ప్రభుత్వం పటిష్టమైన చర్యలను తీసుకువచ్చిందన్నారు. సంబలూరు ఎల్లారెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, ఆకుల శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, రాఘవరెడ్డి, చంద్రరెడ్డి, స్థానిక సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మద్యం షాపును మరో ప్రాంతానికి తరలించండి'

కడప మారుతీనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మా గ్రామ దే వాలయాల మధ్య ఏ ర్పాటుచేసిన మద్యం షాపును మరో ప్రాం తానికి తరలించాలని సిద్దవటం మండలం ఉప్పరపల్లె పంచాయతీ సాయి నగర్ నివాస మహిళలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట వారు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. మద్యం దుకాణానికి 100 మీటర్ల పరిధిలో రామాలయం, సాయిబాబా దేవాలయంతో పాటు ఒక స్కూల్ కూడా ఉందన్నారు. మహిళల భద్రత దృష్ట్యా మద్యం షాపును తక్షణమే మరో చోటికి తరలించి పుణ్యం కట్టుకోవాలన్నారు.

నేటి నుంచి భూ-రీసర్వేపై గ్రామసభలు : తహసీల్దార్

సింహాద్రిపురం, అక్టోబరు 21: మండలంలోని ఆరు గ్రామాలలో మంగళవారం నుంచి భూ-రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవీ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకెలితే... గత వైసీపీ ప్రభుత్వంలో దేవతాపురం, తెలికి, హిమకుంట్ల, జంగంరెడ్డిపల్లి, సింహాద్రిపురం, నిడివెలగల రెవెన్యూ గ్రామాల్లో భూ-రీసర్వే నిర్వహించారు. అప్పట్లో రీ-సర్వేలో విస్తీర్ణంలో ఎక్కువ, తక్కువలతో కూడిన తేడాలు వచ్చాయి. వాటిమీద రైతులు ప్రస్తుత గ్రామ సభల్లో ఫిర్యాదు చేస్తే 45 రోజుల లోపు సమస్య పరిష్కారం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

చెన్నూరు: నజీర్‌బేగ్‌పల్లె, కొక్కిరాయపల్లె, రాచిన్నాయపల్లె, ముండ్లపల్లె గ్రామాల్లో జరిగిన భూసర్వేలో ఈనెల 22 నుంచి 29 వరకు రీసర్వేపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు టి.సరస్వతి తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రీషియన్ కోర్స్

సింహాద్రిపురం, అక్టోబరు 21: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పిఎమ్‌కెవివై) కింద సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలెక్ట్రీషియన్ కోర్స్ ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3నుంచి 4నెలల్లో పూర్తయ్యే ఈ కోర్సులో చేరడానికి 8వ తరగతి ఉత్తీర్ణులైవుండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలకు వచ్చి సంప్రదించాలన్నారు. ఇది విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలను సాధించేందుకు మార్గదర్శకంగా ఉండేలా రూపొందించబడిన ప్రయోజనవంతమైన శిక్షణ అని ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

గండికోట లోగో, ట్యాగ్ లైన్ అధికారిక ప్రకటన



గండికోట లోగా ,ట్యాగ్‌లైన్‌ను ప్రకటిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్

కడప(కలెక్టరేట్), అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): గండికోట వారసత్వం, సంస్కృతిని ప్రతిబింబించేలా సృజనాత్మకమైన లోగో, ట్యాగ్ లైన్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్, జిల్లా పర్యాటక , సాంస్కృతిక శాఖా అధికారి సురేష్‌కుమార్ సోమవారం కలెక్టర్ చాంబరులో అధికారికంగా ప్రకటించారు. లోగో డిజైన్ పోటీలో గెలుపొందిన తుషార్ శివాంకర్‌ను ఇన్‌చార్జి కలెక్టర్ అభినందించారు. గండికోట పర్యాటక అభివృద్ధికి ఈ లోగో, ట్యాగ్ లైన్‌ను రూపొందించామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రతి సమస్య పరిష్కారం కావాలి : కమిషనర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్య క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ఎం.మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుండి 23 అర్జీలు వచ్చాయన్నారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 10, టౌన్ ప్లానింగ్ 8, రెవెన్యూ 3, హెల్త్ విభాగం 1, యుపీఏ 1 అర్జీలువచ్చాయన్నారు. పరిశీలించి అధికారులకు పంపించామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడపనగరం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన జయంతికి సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.5లక్షల చెక్కును కడప ఎమ్మెల్యే మాధవీ టీడీపీజిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ జయంతి భర్త జూలైలో కరెంటు షాక్‌తో చనిపోయాడన్నారు. అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం కానీ పెన్షన్ కానీ ఇవ్వలేదన్నారు. అలాగే వితంతు పింఛను కూడా వచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన

సీకేదిన్నె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేయడం జరిగిందని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పేట పంచాయతీ బాలుపల్లి గ్రామంలో సిమెంటు రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు.

అగ్నిపథ్, అగ్నివీర్ నియామకాలపై అవగాహన

కడప నాగరాజుపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అగ్నిపథ్ పథకంలో అగ్నివీర్ నియమాకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు సందీప్, సురేంద్రసింగ్ మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పదోతగరతి పాస్ అయిన తరువాత 17 సంవత్సరాల నిండిన వారు అగ్నిపథ్‌లో చేరవచ్చని, ప్రతి సంవత్సరం రెండు సార్లు ఇండియన్ ఆర్మీలో ఎంపికలు నిర్వహిస్తారన్నారు. రాత, మౌఖిక పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారన్నారు.

విద్యార్థిని మృతికి కారకులను ఉరి తీయాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని రంగసముద్రం సర్పంచ్ చిత్త రవిప్రకాశ్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, మానవ హక్కుల సంఘ నాయకులు ఫణికుమార్, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీవో లక్ష్మీదేవి, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, ప్రగతి ఫౌండేషన్ నాయకులు డి.శ్రీనివాసులు, సీపీయం నాయకులు భైరవ ప్రసాద్, గంగయ్య, పిడుగు మస్తాన్, మహిళా ప్రజాసంఘాల నాయకులు డిమాం డ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి బస్టాండు ఆవరణలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీమాజీ జవాన్లు, ఫొటోగ్రాఫర్లు, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, జర్నలిస్టుల నాయకులు పాల్గొన్నారు.

లక్షరూపాయల చెక్కు అందజేసిన రితీష్‌రెడ్డి

బద్వేలుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సెంచరీప్లైవుడ్ సమీపంలో శనివారం దుండగుడు నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోవడం పట్ల విద్యార్థిని కుటుంబాన్ని సోమవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, బొజ్జ రోశన్నతో కలసి సోమవారం విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి లక్షరూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యాక్రమంలో టీడీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, రాగి మాను ప్రతాప్‌కుమార్, బిగ్‌బాస్, జగదీశ్వర్‌రెడ్డి, జహంగీర్‌బాష, బాలచెన్నయ్య, శ్రీరామచంద్రవరప్రసాద్, మస్తాన్‌బాబు, చెన్నక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది..: ప్రేమోన్మాది చేతిలో దారుణంగా హత్యకు గురైన విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం పట్టణంలోని బాధితు రాలి నివాసం వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామ ర్శించి లక్షరూపాయల ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ యువనాయకుడుచెరకూరి రవి తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ

బద్వేలు, అక్టోబరు 21,(ఆంధ్రజ్యోతి): బద్వేలులో ప్రేమో న్మాది చేతిలో హత్యకు గురైన విద్యార్థిని కుటుంబ సభ్యు లను సోమవారం కడప ఎంపీ వైఎస్. అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై పెట్రోలు పోసి హత్య చేసిన నిందితుడు విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని నూర్‌బాష దూదేకుల సంఘం రాష్ట్ర నాయకుడు నాగూర్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పీరయ్య, దర్మేంద్ర, బాలచంద్రుడు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఎర్రగుంట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో వీధుల్లో అపరిశుభ్రంగా ఉన్న చోట నగరపంచాయతి అధికారులు బ్లీచింగ్ చల్లడంతోపాటు, స్ప్రే చేయించారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కమిషనర్ శేషఫణి పేర్కొన్నారు. కాగా కడపరోడ్డులోని ఎన్‌హెచ్ రోడ్లపై పడ్డ భారీ గుంతల విషయంలో కమిషనర్ స్పందించారు. ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు.

మాకు జీవనోపాధికి స్థలం ఇప్పించండి

మంత్రి నిమ్మల, ఎమ్మెల్సీని కలిసిన తాళ్లప్రొద్దుటూరు నిర్వాసితులు

కొండాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు ముంపులో తాము సర్వం కోల్పోయామని జీవనోపాధి కొరకు స్థలం ఇవ్వాలని మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన టీడీపీ నేతలు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిశారు. ఈ నెల 3 వతేది మంగళగిరి టీడీపీ కార్యాలయంలో తాళ్లప్రొద్దుటూరుకు చెందిన టీడీపీ కడప పార్లమెంటు విశ్వబ్రాహ్మణ సాధారిక కమిటీ మెంబర్ నరసింహాచారి, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బుగ్గన గారి చంద్రశేఖర్ రెడ్డి మరి కొంతమంది కలిసి వారికి ప్రజావేదికలో వినతిపత్రం అందజేశారు.ఇదే విషయాన్ని కలెక్టరుకు కూడా వినతిపత్రం ఇచ్చినట్లు వారు వివరించారు.ఈ నేపథ్యంలో సోమవారం తాళ్లప్రొద్దుటూరు సచివాలయంలో సర్వేయర్, వీఆర్వోలు విచారించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి విచారణ చేస్తున్నామని తహసీల్దార్ గురప్ప తెలిపారు.

అన్యాక్రాంతమైన భూములను కాపాడండి


ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందిస్తున్న బాధితులు

జమ్మలమడుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నిర్వాసితుల భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని కాపాడాలని సోమవారం ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందించారు. గండికోట ప్రాజెక్టుకు నిర్వాసితులైన చౌటపల్లి గ్రామ ప్రజలకు కేటాయించిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని, ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివ కుమార్ తెలిపారు.

టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

పోరుమామిళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు శశిభూషణ్‌రెడ్డి, స్టాటికల్ ఆఫీసరు రమేశ్‌రెడ్డి, డీపీవో నారాయణ, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సమీపంలోని పాఠశాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు చేయించారు. అలాగే గర్భిణీలకు కూడా పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు మేరీ ఎల్సా, జయరాములు, కరిష్మా, ఆరోగ్య కార్యకర్త, సాదువెంకటేశ్వర్లు, నిర్మల, రఘురాములు, సరస్వతి, నాగమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నలుగురు పోలీసులు బదిలీ

చాపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చాపాడు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న నలుగురు పోలీసులు సోమవారం బదిలీ అయినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్యతెలిపారు. ఏఎస్‌ఐ శంకరయ్య, పోలీసులు భాస్కర్, చంద్రనాయక్, వెంకటసుబ్బరాజు బదిలీ అయినట్లు తెలిపారు. వీరిని కడప, సింహాద్రిపురం, ప్రొద్దుటూరు ప్రాంతాలకు బదిలీ చేసినట్లు చెప్పారు. వీరి స్థానంలో కొత్తగా ఇద్దరిని నియమించినట్లు తెలిపారు.

రేపటి నుంచి పశువైద్య కళాశాలలో జాతీయ సదస్సు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాలలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజులపాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన పశువైద్య నిపుణులు, విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలు హాజరవుతారని పేర్కొన్నారు.

మండలంలో ఆధార్ మొబైల్ క్యాంప్

ఎర్రగుంట్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలో రెండురోజులు ఆధార్ మొబైల్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.వెంకటరమణయ్య తెలిపారు. చిలమకూరు, చిన్నదండ్లూరు, నిడుజువ్వి, కలమల్ల 2, మాలేపాడు, హనుమనగుత్తి గ్రామాల్లోని సచివాలయాల్లో 22, 26తేదీల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి అదృశ్యం

జమ్మలమడుగు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమ్మ దేవాలయం వీధికి చెందిన ఎల్లబోయిన వెంకటరమణ రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి కొద్ది రోజుల నుంచి అదృశ్యమయ్యాడు. ఈనెల 8వ తేదీన తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఇంతవరకు తిరిగి రాలేదని ఆయన కుమారుడు చక్రవర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంగరంగ వైభవంగా జ్యోతుల మహోత్సవం



మైలవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రీయుల ఆరాధ్య దైవమైన శ్రీచౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవం సోమవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఇళ్ల వద్ద నుంచి భక్తులు జ్యోతులను ఎత్తుకుని పుర వీధుల గుండా నాట్యం చేస్తూ పాటలు పాడుకుంటూ ఆనందోత్సాహాల మధ్య సోమవారం ఉదయం చౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్దకు జ్యోతులను చేర్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. నేడు గొడుగుల మహోత్సవం నిర్వహించనున్నారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

బి.కోడూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సేవా సంస్థ ఎంపీఎస్‌ఎస్‌ఎస్ కడప వారి ఆధ్వర్యంలో సోమవారం మహిళా సాధికారత కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీఎస్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు జయపాల్, కో-ఆర్డినేటరు బాలశౌరి, జాకోబ్, మరియన్న, మండల సవ వాఖ్యఅ ధ్యక్షు రాలు,డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోస్టు మెట్రిక్ రెన్యువల్ స్కాలర్‌షిప్‌లకోసం 2024-25 సంవత్సరానికి విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు తమ కళాశాలల్లోని జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఎస్‌డబ్ల్యూవో బి.గురుప్రసాద్ తెలిపారు. స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసిన తర్వాత విద్యార్థులు బయోమెట్రిక్ వేయాలని సూచించారు.